సాక్షి
గుంటూరు
శుక్రవారం, 9, ఆగస్టు, 2024



బోటింగ్ నిలిపివేత

విజయవాడ: వరద ఉధృతి నేపథ్యంలో భవానీ ద్వీపానికి బోటింగ్ సర్వీసులను పర్యాటక శాఖ నిలిపివేసింది. ఫలితంగా బోటింగ్ పాయింట్ వద్ద బోట్లన్నీ నిలిచిపోయాయి.



విత్తన దుకాణాల్లో తనిఖీలు

వినుకొండ(నూజెండ్ల): విత్తన దుకాణాల్లో ఏడీఏ జి.రవిబాబు తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం జేజీఎల్-384 రకం విత్తనాలు వ్యవసాయ సిబ్బంది ద్వారా అమ్ముతున్నట్లు తెలిపారు.

శ్రావణమాసం పూజలు



రొంపిచర్ల : స్థానిక శ్రీ కాను బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వే పక్కన ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం శ్రావణ మాసం పూజలు నిర్వహించారు. బాబా వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



చీరాల: చీరాల మండలం ఈపూరుపాలేనికి చెందిన సయ్యద్ ఆరిఫ్‌ను కిరాతకంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఈపూరుపాలెంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు పాల్పడిన వారిని త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

12న బీఎస్ఎన్ఎల్ అవగాహన సదస్సు

నెహ్రూనగర్: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఈ నెల 12న వినియోగదారుల అవగాహన సదస్సును గుంటూరులోని అరండల్‌పేట బీఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జీఎం ఎస్. శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు జిల్లాలోని ఆసక్తిగల వినియోగదారులంతా హాజరు కావాలని కోరారు. కార్యాలయానికి రాలేని వారు https://meet.google.com/fzo-zbed-wxg ఆన్‌లైన్‌లో గూగుల్ మీట్ లింక్ ద్వారా సదస్సులో పాల్గొనవచ్చని చెప్పారు.

రేంజ్‌లో డీఎస్పీలు బదిలీ

నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది డీఎస్పీలను గురువారం బదిలీ చేశారు. ఈ మేరకు గుంటూరు రేంజ్‌లో పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు. గుంటూరు పశ్చిమ డీఎస్పీ కేవీ.మహేష్‌ను హిందుపూర్‌కు, వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ జి.రామాంజనేయులును బాపట్లకు, బాపట్ల డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణను సీఐడీకి, సీఐడీలో ఉన్న డీఎస్పీ డి.సోమన్నను ఆదోనికి బదిలీ చేశారు.

తగ్గుముఖం పట్టిన కప్పలవాగు

ఊటుకూరు(క్రోసూరు): వర్షాలకు పొంగి ప్రవహించిన ఊటుకూరు కప్పలవాగు గురువారం తగ్గుముఖం పట్టింది. ఆటోలు, ప్రయాణికులు వాగు నుంచే నడిచారు. అయితే ఆర్టీసీ బస్సులు, లారీలు నడవలేదు. ఇక వర్షం లేకుంటే శుక్రవారం పూర్తిగా వాగు ప్రవాహం తగ్గుతుందని గ్రామస్తులు తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 266, బ్యాంక్ కెనాల్‌కు 1486, తూర్పు కెనాల్‌కు 530, పశ్చిమ కెనాల్‌కు 230, నిజాంపట్నం కాలువకు 410, కొమ్మమూరు కాలువకు 1910 క్యూసెక్కులు విడుదల చేశారు.

యార్డుకు 38,673 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 38,673 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 37,792 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,302 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

మెరిసిందోయ్

- దిగ్గజ సంస్థలతో బీఎస్ఎన్ఎల్ ఢీ
- ప్రజల నుంచి పెరుగుతున్న విశేష ఆదరణ
- కార్పొరేట్ సంస్థల టారిఫ్‌లు పెరుగుదలే కారణం
- రోజూ వెయ్యి కొత్త సిమ్‌కార్డులు అమ్మకం!
- ఇప్పటికే గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 4జీ సేవలు
- సెప్టెంబర్ 30 నాటికి 70 శాతం పల్లెల్లో 4జీ



జూలై ఒకటి నుంచి మొబైల్ పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారిన వినియోగదారుల సంఖ్య : **11,382**

జూలై 1 నుంచి బీఎస్ఎన్ఎల్ కొత్త సిమ్‌కార్డులు తీసుకున్న వారి సంఖ్య : **27,155**

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): దిగ్గజ టెలికం కంపెనీలకు దీటుగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) మెరుస్తోంది. ఇటీవల ప్రైవేటు సంస్థలు టారిఫ్‌లు పెంచడంతో వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపిస్తున్నారు. గత రెండు, మూడునెలలుగా కార్పొరేట్ సంస్థల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్న వినియోగదారుల సంఖ్య భారీగా ఉంటుంది. నెలకు రూ.200 రీచార్జి ధరతో ఇతర కంపెనీల వినియోగదారులను బీఎస్ఎన్ఎల్ ఆకర్షిస్తోంది. గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 4,20,559 మంది ప్రీపెయిడ్ వినియోగదారులు ఉన్నారు. జూలై ఒకటి నుంచి కొత్తగా 11,382 మంది బీఎస్ఎన్ఎల్‌కు మొబైల్ పోర్టబిలిటీ ద్వారా మారారు. కొత్త సిమ్‌లు తీసుకున్న వారి సంఖ్య 27,155గా ఉంది. సుమారుగా రోజుకు 900 నుంచి వెయ్యి కొత్త సిమ్‌కార్డులు అమ్ముడవుతున్నట్టు బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకొన్ని రోజుల్లోనే ప్రీపెయిడ్ వినియోగదారుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

గుంటూరు జిల్లా బీఎస్ఎన్ఎల్ సమాచారం	
బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లు	67
ప్రీపెయిడ్ సిమ్ కార్డులు	4,20,559
ఫైబర్ కనెక్షన్లు	27,303
ప్రస్తుతం ఉన్న టవర్లు	384
నిర్మాణంలో ఉన్న టవర్లు	54

4జీతో ముందడుగు

వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో గుంటూరు జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను విస్తరిస్తోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఈ సేవలు అందుతున్నాయి. పల్లెలకూ 4జీ సేవలను అందించేందుకు సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కేంద్ర ప్రభుత్వ ఆత్మనిర్భర్ ప్రాజెక్టులో భాగంగా కల్పిస్తోంది. టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్) నిబంధనలకు అనుగుణంగా పరిమిత రేడియేషన్‌తో అదనపు 4జీ టవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోంది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 384 టవర్లు ఉండగా అదనంగా 54 టవర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. సెప్టెంబర్ 30 నాటికి 70 శాతం పల్లెలకు 4జీ సేవలను అందించే దిశగా అడుగులు వేస్తోంది.

వినియోగదారుల సంఖ్య బాగా పెరుగుతోంది



బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు వస్తున్న వినియోగదారుల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. బీఎస్ఎన్ఎల్ ధరలు, సెల్ టవర్ల నుంచి విడుదలయ్యే రేడియేషన్ ట్రాయ్ నిబంధనలకు అనుగుణంగానే ఉంటాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో 4జీ సేవలు నడుస్తున్నాయి. సెప్టెంబర్ 30 నాటికి 70 శాతం పల్లెల్లో కూడా 4జీ సేవలను అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం.

– ఎస్ శ్రీధర్, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్, గుంటూరు బిజినెస్ ఏరియా

చోరీల తీగ లాగితే

గంజాయి గుట్టురట్టు

- పోలీసులకు పట్టుబడిన ఏడుగురు సభ్యుల ముఠా
- 21 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో పోలీసు అధికారులు

తెనాలిరూరల్: తీగ లాగితే డొంక కదిలినట్టు.. పోలీసులు బైక్, ఇతర చోరీలకు పాల్పడే నేరస్తులపై నిఘా పెడితే గంజాయి ముఠా గుట్టురట్టయింది. ఏడుగురు సభ్యుల ముఠా పట్టుబడడంతోపాటు 21 కిలోల గంజాయి లభ్యమైంది. తెనాలి డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. తెనాలి రూరల్ సర్కిల్ పరిధిలో కొంత కాలం క్రితం జరిగిన చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా పలువురు అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో అందిన సమాచారం మేరకు తెనాలి మండలం సంగం జాగర్లమూడి గ్రామంలోని డంపింగ్ యార్డ్ వద్ద ఓ పాడుపడిన ఇంట్లో సోదాలు చేయగా గంజాయిని చిన్న పొట్లాలుగా చేసి అమ్మేందుకు సిద్ధం చేస్తున్న ఏడుగురు నిందితులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి సుమారుగా రూ.లక్ష విలువ చేసే 21.096 కిలోల గంజాయి, మోటార్ బైక్, 13 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు కొల్లిపరకు చెందిన అమ్మిశెట్టి శివ చందుపై దాదాపు 10 పాత కేసులు ఉన్నాయి. ఇతనితోపాటు బాపట్లకు చెందిన దాసరి భరత్, కొల్లిపరకు చెందిన ఆవులమంద పవన్ సాయి, గుంటూరులో ఉంటున్న ఒడిశాకు చెందిన పరిద సిద్ధార్థపైనా పలు కేసులు ఉన్నాయి. వీరికి తూర్పు గోదావరి జిల్లా రౌతులపూడి మండలం నామగిరి నరేంద్ర పట్టణానికి చెందిన గొర్లు రాజు, కందేపల్లి సతీష్, తోలెం రాము పరిచయమయ్యారు. వీరి ముగ్గురి నుంచి తరుచూ శివ చందు గంజాయి కొని తీసుకొస్తుండేవాడు. తెచ్చిన గంజాయిని భరత్, పవన్‌సాయి, సిద్ధార్థలకు ఇచ్చి చిన్న పొట్లాలుగా చేయించేవాడు. ఈ పొట్లాలను తెనాలి, చేబ్రోలు మండలాల్లోని విద్యార్థులు, స్పిన్నింగ్ మిల్లు కార్మికులు, యువకులకు విక్రయించేవాడు. ఈ క్రమంలోనే తాజాగా రాజు, సతీష్, రాము వద్ద ఉన్న 20 కిలోల గంజాయిని తీసుకున్నాడు. దీనికి నగదు కాకుండా భరత్, సిద్ధార్థ, పవన్‌సాయి చోరీచేసిన మూడు బైక్‌లు, బంగారు ఉంగరం, నల్లపూసల గొలుసు ఇచ్చాడు. వీరు ఏడుగురూ సంగంజాగర్లమూడి డంపింగ్‌యార్డు వద్ద ఉన్నారన్న సమాచారంతో గురువారం ఉదయం పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్కడ గంజాయి పొట్లాలు కడుతూ దానిని తాగుతున్న ఏడుగురినీ పట్టుకున్నారు. వారి వద్ద 21.096 కిలోల గంజాయి మూడు బైక్‌లు, బంగారు ఉంగరం, నల్లపూసల గొలుసు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి ముఠాను అరెస్ట్ చేసిన అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు, డీఎస్పీ బి.జనార్దనరావు, రూరల్ సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.కోటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లు రవి, రాజేష్, కానిస్టేబుళ్లు శ్రీను, రాములును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

జిల్లాలో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. గురువారం తెనాలి డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. తెనాలితో పాటు జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉందని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 12 మందిపై పీడీ యాక్టు నమోదుకు రంగం సిద్ధమైందని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గంజాయి కలిగి ఉన్నా కఠిన చర్యలు..

గంజాయి రవాణా చేస్తున్నా, విక్రయాలు చేపట్టినా సేవిస్తున్నా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ స్పష్టం చేశారు. మూడునెలల్లో గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



కొల్లిపర మండలంలోని కృష్ణానదిలో వరద నీరు

కృష్ణమ్మ వరద ఉధృతి

- లంక గ్రామాలకు, పంట చేలకు పొంచి ఉన్న ముంపు
- 6 లక్షల క్యూసెక్కులు దాటితే పొలాలు వరద పాలు
- 2.93 లక్షల క్యూసెక్కులు దిగువకు వదిలిన అధికారులు
- లంక ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు



కొల్లిపర మండలంలో కరకట్ట దిగువన నదికి ఆనుకుని ఉన్న అరటి తోట

కొల్లిపర: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నది ఉప్పొంగుతోంది. ఇప్పటికే నాగార్జున సాగర్, పులిచింతల, శ్రీశైలం ప్రాజెక్టులు నిండు కుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి గురువారం అధికారులు వరద నీరు వదిలారు. ప్రకాశం బ్యారేజీ వద్ద 40 గేట్లు ఆరు అడుగుల మేర ఎత్తి 2లక్షల 93వేల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఫలితంగా కృష్ణమ్మ లంక గ్రామాలవైపు పరుగులు తీసింది.

ముంపు భయం

అన్నవరపులంక, కొత్తూరు లంక, బొమ్మువానిపాలెం తదితర గ్రామాలు పూర్తిగా కృష్ణానది కరకట్ట దిగువన ఉంటాయి. ఇక్కడి రైతులు లంక భూమిలో పంటలు సాగు చేస్తుంటారు. వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, హనుమాన్‌పాలెం గ్రామాల్లోని రైతులూ నది దిగువ ఉన్న పంట పొలాల్లో అరటి, పసుపు, కంద, బొప్పాయి, కూరగాయలు సాగు చేస్తారు. ఇక్కడ సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉంది. గతంలో వచ్చిన వరదలకు ఇక్కడి పంటలు నీటమునిగాయి. సుమారు 250 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. దీంతో ప్రస్తుతం రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.93 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ఇది ఆరు లక్షల క్యూసెక్కులు దాటితే ముంపు తప్పదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి నుంచే లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, కొల్లిపర, పాతబొమ్మువానిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంక గ్రామాలలో మండల స్థాయి అధికారులు పర్యటిస్తున్నారు. నదిలోకి ఎవరూ వెళ్లవద్దని చెబుతున్నారు.

జెడ్పీ స్థల పరిరక్షణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: సత్తెనపల్లిలో జిల్లా ప్రజా పరిషత్‌కు చెందిన రూ.కోట్లాది విలువైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా స్పష్టం చేశారు. హద్దు మీరి ఆక్రమణలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే అక్కడ ఆక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని తొలగిస్తున్నట్లు ఆమె చెప్పారు. సత్తెనపల్లిలోని జెడ్పీకి చెందిన రెండు ఎకరాల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై గురువారం 'సాక్షి'లో 'జెడ్పీ జాగా.. వేసెయ్ పాగా' శీర్షికతో ప్రచురించిన కథనంపై స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించారు. శుక్రవారం సంబంధిత స్థలాన్ని పరిశీలించేందుకు జెడ్పీ అధికారులను పంపుతున్నామని, పరిశీలన అనంతరం స్థల పరిరక్షణకు శాశ్వత రీతిలో రక్షణ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. జెడ్పీ అతిథి గృహాన్ని అభివృద్ధి పర్చడంతో పాటు జెడ్పీ స్థలంలో పిచ్చిచెట్లు, ముళ్ల కంపలను తొలగించి, జెడ్పీ అవసరాల కోసం వినియోగిస్తామని తెలిపారు. దాతల పేర్లతో పాటు ఇది జెడ్పీకి చెందిన ఆస్తి అని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా జెడ్పీ స్థలంలో నెలకొన్న ఆక్రమణలను తొలగించి, స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎన్వీవీఎస్ వసంతరాయుడు సత్తెనపల్లి ఎంపీడీఓకు ఆదేశాలు జారీ చేశారు.

కలబడిన టీడీపీ నాయకులు

- ఎస్ఎంసీ ఎన్నికలపై రాజకీయ పడగ
- పెదగొట్టిపాడు హైస్కూల్లో వైఎస్సార్‌సీపీ అభిమాన ప్యానెల్ ఎన్నిక
- అడ్డుకుని దాడికి పాల్పడిన తెలుగుదేశం నాయకులు
- పోలీసుల సహకారంతో వైఎస్సార్ సీపీ నాయకుడిని బయటకు గెంటేసిన వైనం
- అధికార బలంతో రెండోసారి ఎన్నికలు జరిపి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్న టీడీపీ నాయకుల ప్యానెల్



టీడీపీ నేతల ఒత్తిడితో వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీకాంత్‌ను బయటకు నెట్టేస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలపై పచ్చ రాజకీయం పడగ విప్పింది. గెలిచిన వైఎస్సార్ సీపీ అభిమాన ప్యానెల్‌ను పక్కనబెట్టి, తెలుగుదేశం నాయకులు నిబంధనలకు విరుద్ధంగా రెండోసారి ఎన్నికలు జరిపించి తమ అనుకూల ప్యానెల్ గెలిచేలా కుట్రలు పన్నారు. వైఎస్సార్‌సీపీ అభిమానులను బూతులు తిడుతూ దాడికి పాల్పడటమే కాకుండా, పోలీసుల సాయంతో వైఎస్సార్ సీపీ నాయకుడిని పాఠశాల నుంచి బయటకు గెంటేశారు. ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఇన్‌చార్జి హెచ్ఎం వేణు ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక నిర్వహించారు. తొలుత పాఠశాలలోని 3,4,5,6,7,8,9,10 తరగతులకు ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున 24 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. వారందరితో కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికకు మొత్తం 23 మంది సభ్యులు హాజరయ్యారు. కోరం సరిపోవడంతో హెచ్ఎం ఎన్నిక జరిపారు. 23 మంది సభ్యుల్లో 12 మంది వైఎస్సార్‌సీపీ అభిమాన చైర్మన్, వైస్‌చైర్మన్‌లను చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి హెచ్ఎం వేణు చైర్మన్‌గా బూసి ఏసుమరియమ్మ ఎన్నికైనట్లు తొలుత ప్రకటించారు.

టీడీపీ నేతల దౌర్జన్యం..

ఇంతలో విషయం బయటకు రావడంతో బయట ఉన్న టీడీపీ నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తమ సభ్యులు ఒకరు రాలేదని, ఇప్పుడు ఆ ఒక్కరిని కూడా పిలిపిస్తామని, మళ్లీ ఎన్నిక జరిపించాలని పట్టుబట్టారు. అధికార బలంతో ఇన్‌చార్జి హెచ్ఎంకు కీలక నేతల నుంచి ఫోన్లు చేయించి తీవ్ర ఒత్తిడి తెచ్చి తొలుత ఎన్నికైన కమిటీ ప్రమాణస్వీకారాన్ని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా పాఠశాలలోకి వెళ్లారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక పూర్తయిన తరువాత మళ్లీ ఎన్నికలు ఎలా జరుపుతారని గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ భర్త వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ శ్రీకాంత్‌తోపాటు మరికొందరు నాయకులు హెచ్ఎంను ప్రశ్నించారు. దీంతో టీడీపీ నాయకులకు శ్రీకాంత్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ నాయకులు శ్రీకాంత్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ, పాఠశాల గదిలో నుంచి బయటకు నెట్టుకుంటూ తీసుకువచ్చి కొట్టారు. అంతటితో ఆగకుండా పోలీసుల సాయంతో శ్రీకాంత్‌ను పాఠశాల నుంచి బయటకు పంపేశారు. టీడీపీ నాయకులు మాత్రం పాఠశాలలోనే ఉండిపోయారు. అనంతరం మళ్లీ ఎన్నికలు నిర్వహించి, తెలుగుదేశం అనుకూల ప్యానెల్‌ను గెలిపించుకున్నారు.

మరో సభ్యుడు రావడంతో మళ్లీ ఎన్నిక

పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎంను 'సాక్షి' వివరణ కోరగా ముందు నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 24 మందికి 23 మంది సభ్యులు హాజరయ్యారని, వారిలో పన్నెండు మంది సభ్యులు బూసి ఏసుమరియమ్మను చైర్మన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. తరువాత 24వ సభ్యుడు వచ్చి తానూ సభ్యుడినే కదా మళ్లీ ఎన్నిక నిర్వహించాలని అడగడంతో మరోసారి ఎన్నిక పెట్టాల్సి వచ్చిందని చెప్పారు.



వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీకాంత్‌పై దాడికి పాల్పడుతున్న తెలుగుదేశం నాయకులు

పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

- 1,053 పాఠశాలల్లో కొలువుదీరిన కమిటీలు
- 14 స్కూళ్లలో వేర్వేరు కారణాలతో నిలిచిన ఎన్నికలు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 1,067 ప్రభుత్వ, జెడ్పీ మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల వారీగా ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించేందుకు విద్యాశాఖ, సమగ్రశిక్ష విభాగం ఏర్పాట్లు చేయగా, 1,053 పాఠశాలల్లోనే ఎన్నికలు జరిగాయి. 14 పాఠశాలల్లో న్యాయ వివాదాలు, వేర్వేరు కారణాలతో ఎన్నికలు నిలిచిపోయాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్లుగా ఎస్ఎంసీలకు తల్లిదండ్రుల నుంచి సభ్యులను ఎన్నుకున్న అనంతరం, ఎన్నికైన సభ్యుల్లో నుంచి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు పూర్తి చేసినట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు.

క్లుప్తంగా

సంగీత, నృత్య పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నగరంపాలెం: గుంటూరు అశోక్‌నగర్‌లోని డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో 2024–25కు సంబంధించి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపల్ కె.ఎస్.గోవిందరాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక గాత్రం, వీణ, వయోలిన్, డోలు, మృదంగం, కూడిపూడి నృత్యం, నాదస్వరం విభాగాల్లో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు అశోక్‌నగర్ ఒకటో వీధిలోని పాఠశాలలో ఉదయం 10.30– సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చన్నారు. 0863 – 2234913 ఫోన్ నంబర్‌లో కూడా సంప్రదించొచ్చని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి

రేపల్లె రూరల్: క్రిమిలేయర్‌ను అమలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉప కులాలవారీగా వర్గీకరించి రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని జై భీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది దోవా రమేష్ రాంజీ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. మనువాద పాలన అమలుకు కేంద్రమే న్యాయస్థానం ద్వారా ఇలాంటి తీర్పులు ఇప్పిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు, నియోజకవర్గ కార్యదర్శి పంతగాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

కొల్లూరు: కారు నియంత్రణ కోల్పోయి పంట కాలువలోకి దూసుకుపోయింది. దీంతో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన కొల్లూరు సమీపంలోని గ్యాస్ గోడౌన్ వద్ద చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం మేరకు.. పేరెచర్లకు చెందిన డి. హర్షవర్ధన్ గురువారం తన తల్లి నాగమల్లేశ్వరి, సోదరి మంజూషలతో కలిసి మండలంలోని పోతార్లంకలో ఉన్న తన భార్య వద్దకు కారులో బయలుదేరారు. రేపల్లె వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారు రోడ్డు వెంట రైతులు నిలిపిన బైకులను తప్పించే క్రమంలో హర్షవర్ధన్ నడుపుతున్న కారు వైపునకు దూసుకొచ్చింది. దానిని తప్పించేందుకు హర్షవర్ధన్ చేసిన ప్రయత్నం విఫలమవడంతో వీరి కారు పంట కాలువలోకి దూసుకెళ్లి, విద్యుత్తు స్తంభానికి సపోర్టుగా ఉంచిన పోల్‌ను ఢీకొంది. కారులోని ముగ్గురు స్వల్పగాయాలకు గురయ్యారు. రైతులు వారిని బయటకు తీసుకొచ్చి కొల్లూరులోని పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సేవలు అందించారు.

స్వాతంత్య్ర దినోత్సవం సమష్టిగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: స్వాతంత్య్ర దినోత్సవాలను సమష్టిగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ.. ఆగస్టు 13కల్లా పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబు పూర్తవ్వాలన్నారు. అధికారులంతా పటిష్ట ప్రణాళికతో సమష్టిగా వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. మైదానంలో ముఖ్య అతిథులకు, ఆహ్వానితులకు, విద్యార్థులకు, ప్రజలకు కూర్చునేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల శకటాలు ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని చెప్పారు. చిన్నారుల నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో ప్రతిభ చాటిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంసాపత్రాలకు సంబంధించిన వివరాలు ఈ నెల 8వ తేదీలోపు కలెక్టరేట్‌కు పంపాలని చెప్పారు. మంత్రి ప్రసంగానికి సంబంధించి అంశాలపై ఆయా శాఖల అధికారులు అభివృద్ధి వివరాలు అందించాలన్నారు. ఇబ్బందులను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డీఎస్ఓ కోమలి పద్మ పాల్గొన్నారు.

దేశ ప్రగతికి అడ్డంకిగా మాదకద్రవ్యాల వినియోగం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: దేశ అభివృద్ధికి మాదకద్రవ్యాల వినియోగం అడ్డంకిగా మారుతోందని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దేశాన్ని మాదకద్రవ్య వినియోగ రహితంగా చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ నెల 12వ తేదీన ఉదయం 9 గంటలకు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించాలని అధికారులకు సూచించారు. అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎఫ్ఓ మహబూబ్ బాషా, డీఈఓ శైలజ, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, సీపీఓ శేషశ్రీ , డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, ఆర్డీఓ పి.శ్రీకర్, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డీఎస్ఓ కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మూడు పురస్కారాలు

తెనాలి: తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మూడు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు వరించాయి. ఆసుపత్రి పనితీరుపై కేంద్ర ఆరోగ్యశాఖ గతేడాది నిర్వహించిన అంచనా పరిశీలనతో ఈ అవార్డు సర్టిఫికెట్లు దక్కాయి. గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీశంకరన్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చేతుల మీదుగా ఎన్‌కాస్, లక్ష్య, ముస్కాన్ సర్టిఫికెట్లను అందుకున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్థోపెడిక్ డాక్టర్ జె.హనుమంతరావు, పిల్లల డాక్టర్ రమణ, ఆసుపత్రి ఏవో మజీదాబేగం ఈ సర్టిఫికెట్లను స్వీకరించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి వారి వెంట ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు.



అవార్డు సర్టిఫికెట్‌ను అందుకుంటున్న ఆసుపత్రి వైద్యులు

క్షయ నియంత్రణకు బీసీజీ టీకా దోహదం

తెనాలి అర్బన్: క్షయ వ్యాధి నియంత్రణకు బీసీజీ టీకా దోహదపడుతుందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వైద్యులు డాక్టర్ దాని ఫ్రాంక్లిన్, డాక్టర్ ప్రియదర్శిని పేర్కొన్నారు. తెనాలి మండలం కఠెవరం–1 సచివాలయ పరిధిలోని బీసీజీ టీకా సెంటర్‌ను గురువారం వారు పరిశీలించారు. ఇప్పటి వరకు టీకాలు వేయించుకున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కఠెవరం గ్రామాన్ని క్షయ రహితంగా తీర్చిదిద్దాలని సూచించారు. బీసీజీ టీకాపై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డీపీసీ రాజరమేష్, ఎస్‌టీఏఎల్ఎస్ సాంబశివరావు, సూపర్‌వైజర్‌లు వెంకటరెడ్డి, పి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ దాని ఫ్రాంక్లిన్, డాక్టర్ ప్రియదర్శిని

ఖరీఫ్‌లో పంటల ప్రణాళికలపై వర్క్‌షాప్

గుంటూరు రూరల్: జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు ప్రణాళికలపై లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా జిల్లాల్లో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం సాగుకు అనుకూలంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పరిస్థితులను సమీక్షిస్తూ పంటల ప్రణాళికలు, ప్రత్యామ్నాయ పంటల గురించి తెలియజేయాలని సూచించారు. ఖరీఫ్ పంటకాలంలో కచ్చితమైన దిగుబడిని ఇస్తూ సాగుకు అనుకూలమైన భూమిలో లాభదాయక పంటలను పండించేలా అధికారులు చూడాలన్నారు. విస్తరణ సంచాలకురాలు డాక్టర్ బి. ప్రమీలరాణి మాట్లాడుతూ.. నీటి సదుపాయం, నేల స్వభావాన్ని బట్టి వ్యవసాయ జోన్లను అనుసరించి పంటల ప్రణాళికలు, ప్రత్యామ్నాయాలను రైతులకు తెలియజేయాలన్నారు. తగిన విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఏరువాక కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా, నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తగిన సలహాలు, సూచనలు రైతులకు అందించాలన్నారు. పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ.. గోదావరి ప్రాంతంలో ఐదురోజుల వ్యవధిలో కురిసిన అత్యధిక వర్షపాతం వల్ల ముందుగానే వచ్చిన ముంపుతో వరికి కొంత ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ప్రత్యామ్నాయంగా స్వల్ప, మధ్యకాలిక రకాలు సూచిస్తూ వాటి విత్తనాలు అందుబాటులోకి తెచ్చి పంట నష్టాన్ని అరికట్టామన్నారు. శాస్త్రవేత్తలు అందరూ లాభదాయకమైన పంటలను రైతులు పండించేలా ప్రోత్సహించాలని కోరారు. పచ్చిరొట్ట ఎరువులు పంటల సరళిలో ఒక భాగం చేసుకుని రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడేలా కృషి చేయాలన్నారు. సాగు నీటికి ఇబ్బంది కలిగిస్తున్న గుర్రపుడెక్క నిర్మూలనకు సమగ్ర పద్ధతులపై పరిశోధనలు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో వరిలో వెద పద్ధతిలో విత్తుకునేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో పత్తి సాగు విస్తీర్ణం తగ్గటానికి కారణాలు, పంటల సరళిలోని మార్పులు గుర్తించాలన్నారు. పత్తి పంటకు ప్రత్యామ్నాయంపై రైతులకు సమాచారం అందించాలని శాస్త్రవేత్తలు, అధికారులకు సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, మండలాల వ్యవసాయ సలహా పరిశోధన సంచాలకులు, వ్యవసాయ కళాశాల అధిపతులు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

దొంగలు చిక్కారు!



చోరీల వివరాలను వెల్లడిస్తున్న క్రైం ఏసీపీ స్రవంతిరాయ్, చిత్రంలో నిందితులు

- బంగారం, ల్యాప్‌టాప్‌లు, బైక్‌లు కాజేస్తున్న ముగ్గురు అరెస్ట్
- రూ. 11 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ స్రవంతిరాయ్

విజయవాడస్పోర్ట్స్: చైన్‌స్నాచింగ్, ల్యాప్‌టాప్, ద్విచక్ర వాహన దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు క్రైం ఏసీపీ స్రవంతిరాయ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 11 లక్షలు విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వివరించారు. వన్‌టౌన్‌లోని సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్) వద్ద గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చోరీ వివరాలను ఆమె వెల్లడించారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు క్రైం ఏడీసీపీ కృష్ణమూర్తినాయుడు పర్యవేక్షణలో సీసీఎస్ సీఐలు, సిబ్బందితో కలిసి బృందాలను ఏర్పాటు చేసి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో ఈ నెల ఏడో తేదీ సాయంత్రం పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గుంటూరు జిల్లా తాడేపల్లి వాసి దేవళ్ల గోపిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఇద్దరు మహిళల మెడలోని బంగారు గొలుసులను తెంపి అనంతరం తాడేపల్లికి పరారై, వాటిని విక్రయించేందుకు విజయవాడ వచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడు నుంచి 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పలు ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ఎ.కొండూరు గ్రామ వాసి దారవతు దుర్గాప్రసాద్‌ను వన్‌టౌన్‌లోని వినాయకటెంపుల్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నున్న ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. పలు నివాస గృహాలు, హాస్టళ్లలోకి ప్రవేశించి లాప్ టాప్‌లను దొంగిలిస్తున్న విజయవాడ శివారు జక్కంపూడికి చెందిన నల్లిబోయిన నాగబాబును బెంజిసర్కిల్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి ఐదు ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న ఎనిమిది ద్విచక్ర వాహనాలలో నాలుగు బైక్‌లు (హీరో గ్లామర్‌లు–ఏపీ16ఈబీ6311, ఏపీ37సీపీ7218, జూపిటర్–ఏపీ07సీఎస్2123)పై ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. ఈ బైక్‌ల యజమానులు తగిన ఆధారాలతో సెంట్రల్ క్రైం స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అత్యవసర కేంద్రాల ఏర్పాటు

గుంటూరు ఈస్ట్: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారుల కోసం మాచర్ల, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, బాపట్ల టౌన్–1, గుంటూరు డివిజన్, ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయాల్లో అత్యవసర కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మురళీకృష్ణ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాలు 24 గంటలూ పనిచేస్తాయన్నారు. ప్రజలు విద్యుత్ సరఫరాకు సంబంధించి అంతరాయం ఏర్పడినా, ఏదైనా సమస్య ఉన్నా, వైర్లు తెగి పడినా ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించిన ఫోన్ నెంబరు – 94408 17526, గుంటూరు టౌన్ 1 – 94408 17527, తెనాలి డివిజన్ – 94408 17535, బాపట్ల డివిజన్ – 94910 52945, నరసరావుపేట – 94408 17539, మాచర్ల – 94408 17531. వర్షాలు కురుస్తున్న సమయంలో స్తంభాలకు తాకవద్దని, చెట్ల కింద నిల్చోవద్దని ప్రజలకు సూచించారు.

రేపు స్టేట్ హోల్డర్స్‌తో రాష్ట్ర స్థాయి సమావేశం

గుంటూరు వెస్ట్: వికలాంగత్వంతో జీవించే పిల్లల హక్కుల పరిరక్షణపై రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో స్టేట్ హోల్డర్స్‌తో రాష్ట్రస్థాయి వార్షిక సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. శనివారం ఉదయం 9.45 – మధ్యాహ్నం 2.15 గంటల వరకు సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జువైనల్ జస్టిస్ చైర్‌పర్సన్ జి.నరేంద్ర కూడా ప్రసంగిస్తారని తెలిపారు. రెండు సెషన్స్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అధికారులతో పాటు జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.


మలబార్‌లో 'మైన్' డైమండ్ షో ప్రారంభం

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో 'మైన్' డైమండ్ షో ఎగ్జిబిషన్‌ను గురువారం డాక్టర్ శ్రీవిద్య కోనేరు, పెద్ది రమణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 14 వరకు మైన్ షో కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజు ధరించే నగలు, వివాహాభరణాలు, బరువు తక్కువ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు ఉందన్నారు. వినియోగదారులు కొనుగోలు చేయాలనుకునే బంగారం విలువలో 10 శాతం ముందుగా చెల్లించి, అడ్వాన్స్ బుకింగ్ పొందవచ్చని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్‌లో పెరిగే బంగారం ధరల నుంచి లబ్ధి పొందవచ్చని తెలిపారు.



11న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని ఎంఏఎం కళాశాలల ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కళాశాలల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం చెస్ టోర్నమెంట్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామశేషగిరిరావు, నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నెల్లూరి రమేష్, ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణలు పాల్గొన్నారు. ఏపీ చెస్ అసోసియేషన్, ఎంఏఎం కళాశాలలు, నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సహకారంతో ఎంఏఎం కళాశాలలో చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు రామశేషగిరిరావు తెలిపారు. వయస్సుతో సంబంధం లేకుండా పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో విజేతలకు రూ.50వేలు నగదు బహుమతిని అందజేస్తామని చెప్పారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతితో పాటు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. స్విస్ లీగ్ పద్ధతిలో జరిగే పోటీలలో పాల్గొనదలచినవారు 97030 49378, 93913 39343 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న రామశేషగిరిరావు, నెల్లూరి రమేష్, వి.సత్యనారాయణ తదితరులు

క్వారీ గుంతలో గల్లంతైన వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: ప్రమాదవశాత్తు క్వారీగుంతలో పడి గల్లంతైన నాయిని హనుమంతరావు (35) మృతదేహాన్ని గురువారం రాత్రి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వెలికితీశాయి. పిడుగురాళ్లకు చెందిన నాయిని హనుమంతరావు, అతని స్నేహితులు ముగ్గురు కలిసి రాత్రి సమయంలో పిల్లుట్ల రోడ్డులోని అద్దంకి – నార్కెట్‌పల్లి హైవేపై ఉన్న పంజాబీ దాబాలో పుల్కాలు తింటుండగా అదే సమయంలో పెట్రోలింగ్ పోలీసులను చూసి భయపడి పరుగెడుతూ వెళ్లి మంగళవారం క్వారీ గుంతలో పడిన విషయం విదితమే. గత మూడురోజులుగా పోలీసులు ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు రేంజ్‌లో మరో 30 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో 30 మంది సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 31న 24 మంది సీఐలను బదిలీ చేయగా, 15 మందిని వీఆర్‌కు పంపించిన విషయం విధితమే..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ
టి.పి.నారాయణస్వామి	పల్నాడు జిల్లా కారెంపూడి	గుంటూరు జిల్లా పెదకాకాని పీఎస్‌కు.
గంగా వెంకటేశ్వర్లు	గుంటూరు రేంజ్ వీఆర్	గుంటూరు జిల్లా తుళ్ళూరు -1 పీఎస్
బెల్లం శ్రీనివాసరావు	గుంటూరు రేంజ్ వీఆర్	గుంటూరు జిల్లా తెనాలి రూరల్ సర్కిల్
దాసరి ప్రసాద్	ప్రకాశం జిల్లా గిద్దలూరు సర్కిల్	పల్నాడు జిల్లా గురజాల టౌన్ పీఎస్
పాచిపాలు ప్రభాకర్	గుంటూరు రేంజ్ వీఆర్	పల్నాడు జిల్లా మాచర్ల టౌన్ పీఎస్
షేక్ నఫీజ్ బాషా	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కందుకూరు సర్కిల్	పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ సర్కిల్
టి.శ్రీనివాసరావు	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కొవ్వూరు సర్కిల్	పల్నాడు జిల్లా కారంపూడి సర్కిల్
ఆర్.అహమీద్‌జానీ	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా డీఎస్‌బీ-2	బాపట్ల జిల్లా బాపట్ల టౌన్ పీఎస్
కె.గంగాధర్‌రావు	తిరుపతి ఆర్ఎస్‌టీఎఫ్ సీఐ	బాపట్ల జిల్లా బాపట్ల రూరల్
షేక్ అన్వర్‌బాషా	గుంటూరు జిల్లా కొత్తపేట పీఎస్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా నెల్లూరు-2 టౌన్ పీఎస్
ఎం.రోశయ్య	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా సౌత్ ట్రాఫిక్ పీఎస్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా నెల్లూరు-4 టౌన్
పీఎస్ జి.గంగాధర్‌రావు	గుంటూరు రేంజ్ వీఆర్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా ఆత్మకూరు సర్కిల్
కె.వాసు	తిరుపతి కమాండ్ కంట్రోల్ సీఐ	గుంటూరు జిల్లా తాడికొండ పీఎస్
మాకినేని శ్రీనివాసరావు	ఒంగోలు డీపీటీసీ/డీటీసీ	పల్నాడు జిల్లా అమరావతి టౌన్ పీఎస్
వై.రామారావు	గుంటూరు రేంజ్ వీఆర్	ప్రకాశం జిల్లా దర్శి సర్కిల్
కె.సురేష్	పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ సర్కిల్	ప్రకాశం జిల్లా గిద్దలూరు యూపీఎస్
జె.రామకోటయ్య	ప్రకాశం జిల్లా కంభం సర్కిల్	ప్రకాశం గిద్దలూరు సర్కిల్
ఎండీ ఫిరోజ్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కనిగిరి సర్కిల్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కావలి 1 టౌన్
కేశవ వెంకటేశ్వరరావు	ప్రకాశం జిల్లా పీసీఆర్ సీఐ	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా కందుకూరు సర్కిల్
జి.మంగారావు	పల్నాడు జిల్లా పెదకూరపాడు సర్కిల్	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా గుడ్లూరు సర్కిల్
వై.వీరాసోమయ్య	ప్రకాశం జిల్లా గిద్దలూరు యూపీఎస్ సీఐ	గుంటూరు జిల్లా పాతగుంటూరు పీఎస్
కె.శేఖర్‌బాబు	గుంటూరు రేంజ్ వీఆర్	తిరుపతి గుడూరు -1 టౌన్ పీఎస్
హెచ్ఎస్ హుస్సేన్‌బాషా	నెల్లూరు జిల్లా సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్	తిరుపతి వాకాడు సర్కిల్
ఎం.బాజీ	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా నెల్లూరు 2 టౌన్	తిరుపతి నాయుడుపేట యూపీఎస్
మాకినేని మురళీకృష్ణ	గుంటూరు రేంజ్ వీఆర్	తిరుపతి సూళ్లూరుపేట సర్కిల్
జి.సోమశేఖర్	బాపట్ల జిల్లా చీరాల 2 టౌన్ పీఎస్	ప్రకాశం జిల్లా కొండేపి సర్కిల్
ఎ.శివప్రసాద్	గుంటూరు పీసీఆర్	గుంటూరు లాలాపేట పీఎస్
కె.వేమూరెడ్డి	గుంటూరు మహిళా పీఎస్-1	ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా సంగం సర్కిల్
ఎం.వీరయ్య	గుంటూరు రేంజ్ వీఆర్	గుంటూరు కొత్తపేట పీఎస్
ఎస్.శ్రీకాంత్	గుంటూరు రేంజ్ వీఆర్	ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ సర్కిల్

నదీ పరివాహక గ్రామాలు అప్రమత్తం

దాచేపల్లి: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు నీరు విడుదల చేయటంతో కృష్ణానది పరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తహసీల్దార్ వైవీ కుటుంబరావు అన్నారు. మండలంలోని రామాపురం, పొందుగల గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. నదిలో నీటి ఉధృతిని పరిశీలించారు. రామాపురంలో మత్స్యకారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. నదిలో నీటి ప్రవాహం పెరిగితే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. పొందుగలలో కూడా పర్యటించి నది వెంబడి నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ పారామెడికల్ డిప్లమా DMLT, అనస్తీషియా, రేడియాలజీ, ఇమేజింగ్, కార్డియాక్ - 2 సం॥లు; BPT (డాక్టర్); B.Sc. MLT కోర్సులు. అర్హత : ఇంటర్ BiPC /Any గ్రూప్. SC, ST, BC స్కాలర్‌షిప్ & హాస్టల్ కలవు. సంప్ర : ASIAN, VIJAYAWADA - 78800 85835.

REAL ESTATE
■ అమరావతి పరిసరప్రాంతాలలో నేషనల్ హైవే, IJM కొప్పురావూరు సమీపంలో UDA ఇళ్ళ స్థలాలు, పొలాలు, క్లియర్ టైటిల్‌తో కావలసిన వారు సంప్ర॥ 98467 24984, 8885168444
■ మంగళగిరిలో అపార్ట్‌మెంట్ Sf t- 4k, 1200 Sft రెంట్ - 30k విజ్ఞాన్ యూనివర్సిటీ, 100 గ॥-10ల॥, రెంట్-20k, చిలకలూరిపేటలో 100 గ॥-4ల॥, రెంట్-20k, GNTలో గ॥ 23k. ✆ 96035 30555

PLOT FOR SALE
■ గుంటూరు, అమరావతిరోడ్, లాం ఫామ్‌లో CRDA అప్రూవ్‌డ్ కలిగిన 374 గజాలు గల ప్లాట్ అమ్మకమునకు కలదు. గజం రేటు-35000, నో బ్రోకర్స్ కావలసినవారు సంప్ర॥ 8790640575
■ కేవలం 7.5 లక్షలకే 25 సెంట్ల భూమి & 100 ఎర్రచందనం మొక్కలతో కలిపి రి॥ చేయబడును. ... ✆ 96661 66407, 96031 84207

SERVICES
■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో ఋణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342

BUSINESS OFFER
■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179

HEALTH CARE
■ త్రాగుడు మాన్పించండి, త్రాగేవారికి తెలియకుండానే, అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కొట్టకల్ కేరళ మందులతో వైద్యం. సంప్ర॥ 9440870099

WANTED
■ సంస్థ నందు పనిచేయుటకు టెలికాలర్స్ మార్కెటింగ్ మేనేజర్స్, ఇంటిలో పని వారు, వాటర్ ప్లాంట్‌లో డ్రైవర్లు మరియు పనివారు కావలెను. సంప్ర॥ 6305122366

■ ప్రముఖ కంపెనీ నందు ఒక గంట పార్ట్ టైం/ఫుల్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ ఇవ్వబడును. వివరాలకు వాట్సప్/కాల్ చేయండి. 9885682589
■ తెనాలి బాపట్ల చీరాల రేపల్లె నరసరావుపేట సత్తెనపల్లి మా బ్రాంచ్ ఆఫీసులలో పనిచేయుటకు పురుషులు, స్త్రీలు కావలెను. అర్హత : 7th-PG, Sal: 18,000-25000/-. 9080740757
■ అతిథిగృహాల్లో నందు పనిచేయుటకు మహిళలు కావలెను. సేల్స్‌గర్ల్స్ & పిండివంటలు తయారు చేయుటకు హెల్పర్స్ కావలెను. వయస్సు 18-35 సం॥లోపు మాత్రమే. టైమ్: ఉ.8-సా.8 గం.ల వరకు & ఉ.9 గం.ల - సా.9 గం.ల వరకు, ఆకర్షణీయమైన జీతం, (P/T, F/T కలదు) లక్ష్మీపురం హరిహర మాల్ ప్రక్కన, గుంటూరు. ఫోన్ నెం.9396971898
■ గుంటూరు నరిపూడి సుజాకి షోరూంలో పని చేయుటకు అనుభవం కలిగిన GM అడ్మిన్ (F) సేల్స్ మేనేజర్స్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. రియల్ ఎస్టేట్ రంగంలో చేసిన వారికి ప్రాధాన్యత. ✆ 7799960149 / 199
■ కావలెను. గుంటూరు-చిలకలూరిపేట హైవే తుమ్మలపాలెం ఏరియాలో 8గం॥ల డ్యూటీ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జంటుగా కావలెను. జీతం: 13,500/-(పిఎఫ్, ఈఎస్ఐ) పోను 11,150/-)ఎటువంటి అనుభవం అవసరం లేదు. సంప్రదించండి. 9490847225, 7569449088
■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు Male PET (Physical Education Trainer) కావలెను. ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనం వసతి కల్పించబడును. పనిచేయు ప్రదేశం: గుంటూరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్: 9248733369, 8978480429
■ గుంటూరులో మార్బుల్ గ్రానైట్ వర్క్ చేయుటకు మార్బుల్ మేస్త్రి కావలెను. 8886868771, 8500815379
■ ప్రముఖ లిమిటెడ్ పాలసీ నందు తెనాలి, పొన్నూరు,చీరాల, చిలకలూరిపేట,గుంటూరు, అమరావతి ఏరియాలలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.సంప్ర॥ 8143579659
■ ప్రముఖ స్కూల్ నందు B.Ed చదివిన టీచర్స్ & 10th, ఇంటర్ చదివిన టీచర్స్ కావలెను. మరియు వంట చేయుటకు వంట మనిషి, ఆయాలు కావలెను.మంచిజీతం॥ 9550029851
■ YIP PVT LTD recruits Male or Female Age 18 to 45. Qul: 10th to Any Degree. Salary 18000 and above work from home facility is available. 8121818692

■ PAPARAO HIGH SCHOOL, K.UPPALA PADU, near Tangutur, Prakasam (Dt.) Wanted Hindi, Science, Social Teachers to Teach Primary (Ladies) & High School Classes (E.M). Salary Negotiable Free Boarding, Lodging Cont. ✆ 7019326579, 8008622210
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573833520.
■ లేడి HR మేనేజర్లు, లేడి టెలికాలర్లు గుంటూరులో పని చేయుటకు కావలెను. జాబ్ & ఉచిత వసతి కలదు. WhatsApp ✆ 89855 97933
■ ఒమేగా హోస్పేస్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటివనికి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 20K. ఫోన్. 8977639662, 8977639663
■ Wanted COOKS / CHEFS for Akshayapatra Foundation, Mangalagiri. Contact: 9533443131, 7097873362

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (+జీఎస్టీ)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పెట్టెలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.